క్లుప్తంగా

శుద్ధజల యంత్రం అందజేత



యంత్రం ప్రారంభిస్తున్న చైర్మన్ మహేశ్

తానూరు: విద్యార్థులకు శుద్ధ జలం అందించేందుకు మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలకు దివ్యాంగ శక్తి ఫౌండేషన్, శక్తి సేవ ఆధ్వర్యంలో శనివారం మినీ ఆర్వోప్లాంట్(శుద్ధజల యంత్రం) విరాళంగా అందజేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ మహేశ్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈవో నరేందర్, నాయకులు పోతారెడ్డి, సుదర్శన్, గణేశ్, ఉపాధ్యాయులు భూమన్నయాదవ్, సుదర్శన్, పద్మ, మాధవ్‌రావు, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా గాజుల వేడుక



సమావేశమైన మహిళలు

లోకేశ్వరం: మండలంలోని హవర్గ గ్రామంలో మహిళలు శనివారం ఓ ఇంటి ఆవరణలో సమావేశమై చేతులకు గోరింటాకు పెట్టుకొని గాజులు వేసుకున్నారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకొని సందడిగా గడిపారు. నిత్యం ఇంటిపనుల్లో నిమగ్నమై ఉండే మహిళలు తమకంటూ వేదికను సృష్టించుకున్నారు.

విద్యార్థుల హాజరు పెంచాలి



టీ షర్టులు అందిస్తున్న హెచ్‌ఎం అరుణ

లోకేశ్వరం: విద్యార్థుల హాజరు పెరిగేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని లోకేశ్వరం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అరుణ అన్నారు. శనివారం మండలంలోని బామ్ని(కే) గ్రామంలో ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో అక్షరాలను బోర్డుపై రాయించి చదివించారు. కిచెన్ గార్డెన్, పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుడు దండే విలాస్ సొంతఖర్చులతో సమకూర్చిన రూ.5 వేల విలువైన స్కూల్ టీషర్టులను హెచ్‌ఎం విద్యార్థులకు అందించారు. పాఠశాల హెచ్‌ఎం బర్ల చిన్నయ్య, ఉపాధ్యాయుడు విలాస్, సీఆర్పీలు ఉన్నారు. పాఠశాలల విద్యార్థులను అభినందించారు.

దెబ్బతిన్న పంటల సర్వే

కడెం: భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను గుర్తించేందుకు మండలంలోని ఉమ్మడి గంగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో శనివారం సర్వే చేశారు. ఏఈవో సాయికృష్ణ రైతులతో కలిసి పంటల సర్వే నిర్వహించారు. నిబంధనల ప్రకారం 33 శాతం కంటే పంట నష్టం ఎక్కడ జరగలేదని ఏఈవో పేర్కొన్నారు.

పేద కుటుంబానికి చేయూత



సరుకులు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కిశోర్‌సింగ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పేదకుటుంబం కావడంతో ఓకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఒడ్డెపల్లి కృష్ణంరాజు శనివారం మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

నమూనా ఎన్నికలతో నాయకత్వ లక్షణాలు

కుంటాల: పాఠశాలల్లో నమూనా ఎన్నికలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఎంఈవో ముత్యం పేర్కొన్నారు. శనివారం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు నమూనా ఎన్నికలు నిర్వహించారు. ఆయన హాజరై విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. 342 మంది విద్యార్థినులు, 403మంది విద్యార్థులు ఓటర్లుగా పాల్గొన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా పాఠశాల ప్రిన్సిపాల్ ఎత్రాజ్ రాజు వ్యవహరించారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

భైంసారూరల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని మండలంలోని మహాగాం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎస్.కృష్ణ అన్నారు. శనివారం మండలంలోని మహాగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో 30 మంది విద్యార్థులు తమ తల్లులతో కలిసి మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు హరీశ్, రాగిణి, శ్రీలత పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. ప్రయాణానికి చింత



లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ నుంచి సోన్ మండలం న్యూవెల్మల్, బొప్పారం గ్రామాలకు సరస్వతి కాల్వ పక్క నుంచి వెళ్లే రోడ్డు రెండు కిలోమీటర్ల మేర గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలు సాగించే ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిజామాబాద్ వెళ్లేవారు ఎక్కువ ఈ రోడ్డునే వినియోగిస్తారు. అధికారులు రాచాపూర్– న్యూవెల్మల్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షం చేసిన నష్టం

కుంటాల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని గ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. కుంటాలకు చెందిన తాటి శివ, వెంకూర్‌కు చెందిన కె.కృష్ణారావు అనే రైతులు ఓలా శివారులో చెరో మూడు ఎకరాల్లో జొన్న సాగు చేశారు. కంకి వేసి కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో వర్షాలు కురువడంతో జొన్న కంకులు నలుపు రంగులోకి మారాయి. తమకు చెరో రూ.2 లక్షల వరకు నష్టం వచ్చిందని రైతులు వాపోయారు. చేసేదేం లేక పంటను పశువుల గ్రాసం కోసం వినియోగిస్తున్నట్లు వాపోయారు.



అటెన్షన్ ప్లీజ్.. గుంతల రోడ్డుపై పట్టింపేది?



తానూరు: మండలంలోని బోరిగాం నుంచి బెంబర గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు కంకర తేలి ప్రమాదకరంగా మారింది. గుంతలు తెలియక రాకపోకలు సాగించే ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శివలింగయ్య పీఆర్ ఏఈ, ఫోన్ : 93460 69607

అక్రమాలకు పాల్పడితే సహించబోం

- డీఆర్డీవో విజయలక్ష్మి
- రూ.లక్షా 12వేలు రికవరీ చేయాలని ఆదేశం



లోకేశ్వరంలో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఆర్డీవో విజయలక్ష్మి

లోకేశ్వరం: ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే సహించబోమని.. సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని లక్ష్మీ కల్యాణ మండపంలో 15వ విడత ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం కింద మండలంలోని గ్రామాల్లో చేపట్టిన వివిధ పనులపై పది రోజుల పాటు సామాజిక తనిఖీలు నిర్వహించారు. పథకం కింద మండలంలో వివిధ పనుల కోసం రూ.8కోట్ల 16లక్షల 85వేల 874 ఖర్చు చేసినట్లు వివరించారు. డీఆర్డీవో మాట్లాడుతూ పని ప్రదేశాల వద్దకు తప్పనిసరిగా ఉపాధిహామీ సిబ్బంది, కార్యదర్శులు వెళ్లాలని సూచించారు. ఎంబీల్లో తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. మండలంలోని గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లకు సంబంధించి రికార్డులు పరిశీలించారన్నారు. తనిఖీలో మండలంలోని గ్రామాల నుంచి రూ.1లక్షా12వేల 27 రికవరీ చేయాలని డీఆర్డీవో పంచాయతీరాజ్ అధికారులు, ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. ఈ ప్రజావేదికకు కూలీలెవరూ హాజరు కాలేదు. గ్రామ కార్యదర్శులు, డీఆర్పీలు, వీఎస్ఏలు, ఎఫ్ఏలు, టీఏలు, నర్సరీల నిర్వాహకులు హాజరయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, ఎంపీడీవో సోలమాన్‌రాజ్, వెంకటరమేశ్, ఎస్సార్పీ మహేశ్, ఎస్టీఎం దత్తు, ఏపీఏ లక్ష్మయ్య, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, టీఏలు మంజుల, శారద, రవీందర్, హరిత, ఆత్మ చైర్మన్ నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ మాజీ సర్పంచ్ సుక్కు ముత్తన్న అనారోగ్యంతో శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందాడు. శనివారం కనకాపూర్‌లో నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ముత్తన్న పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. ముత్తన్న మృతి మండలానికి, పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు చిన్నయ్య, రమేశ్, వేణుగౌడ్ తదితరులు ఉన్నారు. కనకాపూర్‌లో ముత్తన్న కుటుంబాన్ని మాజీ మంత్రి ఐకేరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావులు పరామర్శించారు. అల్లోల మురళీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, రాజేందర్, గణేశ్, వెంకటరాజు తదితరులు ఉన్నారు.

తెగిన విద్యుత్ తీగ.. తప్పిన ప్రమాదం



తీగను సరిచేస్తున్న సిబ్బంది

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి విద్యుత్ తీగ తెగి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌పై పడింది. శనివారం ఉదయం గమనించిన పారిశుద్ధ్య సిబ్బంది, విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వచ్చి తీగను సరిచేశారు. తెగిపడిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇందులో లైన్‌మెన్ గంగాధర్, అసిస్టెంట్ లైన్‌మెన్ ఇలియాజ్, గంగాధర్, కార్మికులు ఉన్నారు.

ఎరువులు ఇవ్వాలని నిరసన



నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

ఖానాపూర్: రైతులకు సరిపడా యూరియా బస్తాలు సరఫరా చేయాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి అ ల్లెపు పీటర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని సత్తన్‌పల్లి పీఏసీఎస్ సొసైటీ వద్ద పలువురు రైతులతో కలిసి ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. యూరియా కోసం సొసైటీ చుట్టూ పడిగాపులు కాస్తూ ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేశారు.

పురుగుల మందు తాగిన వివాహిత

కడెం: ఓ వివాహిత అనుమానాస్పదంగా పురుగుల మందు తాగి ఆసుపత్రి పాలైన ఘటన కడెం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండలంలోని అల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పాలరేగడికి చెందిన అర్కె అనిల్‌కు ఇటీవల మహారాష్ట్రకు చెందిన ప్రియాంకతో వివాహం జరిగింది. శనివారం ప్రియాంక పురుగుల మందు తాగి అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు గమనించి ఉట్నూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు తాగిందా, ఏవరైనా బలవంతంగా పురుగుల మందు తాగించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న ఎస్సై సాయికిరణ్ పాలరేగడి గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని.. విచారణ జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని వట్టోలి గ్రామానికి చెందిన జక్కోల్ల జనార్దన్ తండ్రి రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం జనార్దన్ కుటుంబసభ్యులను ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ పరామర్శించారు. ప్రవీణ్, ప్రకాశ్, సాయన్న, సంజీవ్ ఉన్నారు.

ఎఫ్‌టీఎల్ జోన్‌లో నిర్మాణాలు వద్దు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో బొడ్డానికుంట పరిధి ఎఫ్‌టీఎల్(పూర్తి నీటి నిల్వ సామర్థ్యం) పరిధిలో నిర్మాణాలు నిలిపివేయాలని కోరుతూ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువు వద్ద చేపట్టే సబ్‌సెంటర్‌కు ఏమైనా అనుమతులు ఉన్నాయా అనే విషయమై సంఘ సభ్యులు అధికారులను ఫోన్‌లో ఆరా తీశారు. ఈ విషయమై సోమవారం అధికారులతోపాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఆ సంఘం అధ్యక్షుడు పరిమి సురేశ్, కార్యదర్శి మట్రి రమేశ్, రవి, చంద్ర విలాస్, లాలు, గణేశ్, సురేశ్, గంగాధర్ ఉన్నారు.

తహసీల్దార్‌గా సంధ్యారాణి

సారంగపూర్: మండల తహసీల్దార్‌గా సంధ్యారాణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి తహసీల్దార్ శ్రీదేవి కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లగా అక్కడ సూపరింటెండెంట్‌గా పని చేసే సంధ్యారాణి సారంగాపూర్‌కు బదిలీపై వచ్చారు. తహసీల్దార్‌కు సిబ్బంది స్వాగతం పలి కారు.

పాఠశాలలో టీఎల్‌ఎం మేళా

బాసర: బాసరలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం టీఎల్‌ఎం మేళా ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈఓ మైసాజీ మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీసేందుకు టీఎల్‌ఎం మేళాలు ఉపయోగపడతాయన్నారు. విద్యా ర్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17 నుంచి సేవా పక్వాడ కార్యక్రమాలు



సారంగపూర్: మాట్లాడుతున్న నరేశ్, నాయకులు



సోన్ బీజేపీ కార్యాలయంలో..

మామడ: భారత ప్రధాని మోదీ జన్మదినం ఈనెల 17నుంచి గాంధీ జయంతి (అక్టోబర్ 2) వరకు బీజేపీ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు రంజిత్‌కుమార్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. 17న మండలకేంద్రంలో రక్తదాన శిబిరాలు, 18న ఆత్మనిర్భర్ భారత్, వికాసిత్ భారత్ అంశాలపై చిత్రలేఖనం పోటీలు, స్వచ్ఛభారత్ కార్యక్రమం, 25న బూత్ పరిధిలో మొక్కలు నాటడం, దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులు, 27న దివ్యాంగులకు సన్మానం, ఉపకరణాల పంపిణీ, అక్టోబర్ 2న గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రీ చిత్రపటాలకు పుష్పాంజలి, ఖాదీ ఉత్పత్తుల కొనుగోలు తదితర కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు. మండల ఇన్‌చార్జి సాహెబ్‌రావు, బాపురెడ్డి, రాజారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటరమణ, చిన్నారెడ్డి, శ్రీనివాస్, పవన్ పాల్గొన్నారు.

సారంగపూర్: బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టే సేవా పక్వాడ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని బీజేపీ మండలాధ్యక్షుడు కాల్వ నరేశ్ అన్నారు. సారంగపూర్ సమీపంలోని కరుణాకర్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

లోకేశ్వరం: సేవా పక్వాడ కార్యక్రమాలపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేశెట్టి అశోక్ అవగాహన కల్పించారు. మండలకేంద్రంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అనంతరం ఎంబీ బీస్ సీటు సాధించిన మండలకేంద్రానికి చెందిన మెండె రవితేజను, సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్‌గా ఎంపికైన కొందపూరం రోహిత్‌ను సన్మానించారు. బీజేపీ నాయకులు సాయన్న, సుమ న్‌కుమార్, నల్ల రమేశ్, శ్రీధర్, శంకర్‌గౌడ్, రాజశేఖర్, సాయితేజ గౌడ్, అనిల్ పటేల్, సాహెందర్, దేవేందర్ ఉన్నారు.

సోన్: సేవా పక్వాడ కార్యక్రమాలపై సోన్‌లోని బీజేపీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు మార గంగారెడ్డి ఆధ్వర్యంలో కార్యశాల నిర్వహించారు. పార్టీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు పక్షం రోజులపాటు జిల్లా కౌన్సిల్ సభ్యులు నరేశ్, బోనగిరి నర్సయ్య, దాసరి శ్రీనివాస్, వెంకట్ నర్సయ్య, పత్తి రాజు, సుంకరిసాయి తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: సేవా పక్వాడ కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రావుల రాము పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో వివరాలు వెల్లడించారు. కన్వీనర్ అనిల్, కోకన్వీనర్ సుభాష్, దిలీప్, పోశెట్టి, రాజన్న పాల్గొన్నారు.

నిర్మల్: నర్సాపూర్(జి) మండలకేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో బీజేపీ చేపట్టే సేవా పక్వాడ కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. జిల్లా కార్యదర్శి రాజేందర్, ప్రధాన కార్యదర్శి మహిపాల్, పాల్గొన్నారు.

కుంటాల: గ్రామాల్లో సేవా పక్వాడ కార్యక్రమాలు చేపట్టాలని ఆ పార్టీ మండల కన్వీనర్ పసుల నవీన్ పేర్కొన్నారు. కుంటాలలో విలేకరులతో మాట్లాడారు. గజ్జారాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేశెట్టి అశోక్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

దస్తురాబాద్: మండలంలోని బుత్కూర్ గ్రామానికి చెందిన మర్రిపెల్లి లక్ష్మి(31) అనే మహిళ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఆమెతో కలిసి దస్తురాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2008–09లో పదోతరగతి చదివిన మిత్రులు రూ.10వేలు జమ చేశారు. శనివారం బుత్కూర్‌లో బాధిత కుటుంబానికి నగదు అందజేశారు.

మెడికల్ కిట్లు అందజేత

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీ హెచ్‌ఎస్‌లోని ఆరో తరగతి విద్యార్థులకు శనివారం మెడికల్ కిట్లు, నెయిల్ కటర్లను అందజేశారు. పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు వెన్నం అంజయ్య సొంత ఖర్చులతో విద్యార్థులకు కిట్లను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేందర్‌రావు తదితరులున్నారు.

యువకుడి హల్‌చల్

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామానికి చెందిన ఆకుల శివ అనే యువకుడు సారంగాపూర్ మండలకేంద్రంలోని బస్టాండ్ ఎదుట రోడ్డుపై శనివారం హల్‌చల్ చేశాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని యువకుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తాగిన మైకంలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించడంతోపాటు ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినందుకు యువకుడిపై కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన

భైంసాటౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా 108 అంబులెన్స్ టెక్నీషియన్ పూజారి లక్ష్మణ్ సీపీఆర్ ఎలా చేయాలనే అంశాలను విద్యార్థులకు వివరించారు. మారుతున్న జీవనశైలి, ఆహార అలవాట్లతో చిన్న వయసులోనే గుండెపోటు బారిన పడుతున్నారని.. ఇలాంటి సమయంలో సీపీఆర్‌తో తిరిగి గుండె కొట్టుకునేలా చేయవచ్చని వివరించారు. అనంతరం సీపీఆర్ చేసే విధానం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు శంకర్, తదితరులున్నారు.

నానో యూరియాతో దిగుబడులు



సోన్ : పొలం పరిశీలిస్తున్న ఏవో వినోద్‌కుమార్



భైంసాటౌన్ : అవగాహన కల్పిస్తున్న సాయినాథ్

సోన్: వరిపొలాల్లో నానో యూరి యా వినియోగిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఏవో వినోద్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని గంజాల్ గ్రామంలో వరి పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ మొ దటి దఫా గ్రాన్యూవల్ యూరియా, రెండో దఫా నానో యూరియా వాడితే దిగుబడులు సాధించవచ్చన్నారు. అక్కడక్కడా ఎండాకు తెగులు సోకిందని.. దీని నివారణకు నత్రజని వాడకం తాత్కాలికంగా నిలిపివేసి పొటాష్ వినియోగించాలన్నారు. ఇందులో రైతుల పోశెట్టి, సాయన్న, ముత్యం ఉన్నారు.

ప్రత్యామ్నాయంగా వినియోగించాలి..

భైంసాటౌన్: రైతులు యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడకం పెంచాలని భైంసా ఏఈవో సాయినాథ్ అన్నారు. శనివారం పట్టణంలోని కిసాన్‌గల్లీలో రైతులకు నానో యూ రియా ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఖర్చు తక్కువతోపాటు మెరుగైన ఉత్పాదకత కోసం నానో యూరియా వాడాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు తదితరులున్నారు.

కుటుంబాన్ని ఆదుకోవాలి

దస్తురాబాద్: ముథోల్ ఆశ్రమ పాఠశాలలో 35 ఏళ్లగా దినసరి కూలీగా పని చేసి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కసుబాయి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టీజీ వెల్ఫేర్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోల వసంత్ డిమాండ్ చేశారు. శనివారం దస్తురాబాద్‌లో మాట్లాడారు. అంతకుముందు మండలంలోని ఆకొండపేట పంచాయతీ పరిధి గోండుగూడలో నిర్వహించిన కసుబాయి (58) నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబసభ్యులను పరామర్శించినట్లు పేర్కొన్నారు. ఆ సంఘం కార్యదర్శి రమేశ్, ఎస్‌సీఆర్పీ జంగు తదితరులు పాల్గొన్నారు.


వలలో చిక్కింది.. విలవిలలాడింది





నిర్మల్‌ఖిల్లా: మొక్కజొన్న పంట రక్షణకు ఓ రైతు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ వలలో కొండచిలువ చిక్కుకొని విలవిలలాడిన ఘటన జిల్లాకేంద్రం సమీపంలోని అక్కాపూర్ శివారులో చోటు చేసుకుంది. శనివారం మధ్యాహ్నం అటుగా వెళ్లిన రైతులకు వలలో చిక్కుకున్న కొండచిలువ కనిపించడంతో వారు శాంతినగర్ కాలనీకి చెందిన స్నేక్ క్యాచర్ గిరిగంటి అనిల్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి ఏడు అడుగుల పామును చాకచాక్యంగా పట్టుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రెండు రోజుల కిందట వలలో చిక్కుకోవడంతో గాయాలవగా ఆహారం లేక నీరసించినట్లు తెలిపారు. పశువైద్యాధికారి శ్రీకర్ రాజుతో కొండచిలువ చర్మంపైన గాయాలకు వైద్యం చేయించి సమీప అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినట్లు స్నేక్ క్యాచర్ పేర్కొన్నారు..

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి



ఉపాధ్యాయులతో ఎంఈవో ముత్యం

కుంటాల: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని.. వారి సేవలు వెలకట్టలేనివని ఎంఈవో ముత్యం పేర్కొన్నారు. ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మండలంలోని ఆయా పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులను శనివారం కుంటాల రైతువేదికలో సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ. రమణారావు, మండలాధ్యక్షుడు అంబకంటి సతీశ్, ప్రధాన కార్యదర్శి కొండా ప్రవీణ్, టి.పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్, సిద్ధిరాం, సక్రపు గజేందర్, తాటి సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.